సీరియల్ కథ

# నీకై నేనొక అభిసారికలా!

* రచయిత్రి : శ్రీమతి పి. మాణిక్యం *



(రచయిత్రి)

[గతసంచిక తరువాయి]

ఆ రోజు అతను భోంచెయ్యలేదు. మనసంతా అల్లకల్లోలమై పోయింది. తను ఎందుకు బ్రతకాలి? ఎవరి కోసం? ఛ...ఇంత డబ్బున్నా, అందం వున్నా, చదువు వున్నా నా బ్రతుకు ఎంత చిత్రంగా బాధాకరంగా వుంది? ఎందుకీ బ్రతుకు నాకు? ఇలాంటి దౌర్భాగ్యపు బ్రతుకు బ్రతికే కంటే చావే నయం!

తనకు నిజంగా కళ్ళొస్తాయా? తిరిగి మామూలు మనిషవుతాడా? లేక తన బ్రతుకంతా ఈ అంధకారంలో కందీల్లా గడచిపోతుందా? భగవంతుడా! నన్నెందుకిలా చిత్రవధ చేస్తున్నావు? ఒక్కసారి చంపెయ్యకూడదూ? ఎవరికేం అన్యాయం చేశానని నాకీ శిక్ష?

మరుచటి రోజు సుమిత్ర వచ్చింది.

'అరే...ఏమిటంత నీరసంగా వున్నారు? ఒంట్లో బాగు లేదా?' నుదుటిమీద చేయివేసి చూసింది. సంతృప్తిగా నిట్టూర్చి—

'మీరేదో బాధ పడుతున్నారు? అవునా? అస్సలు మీరీ రోజు భోజనం చేశారా?'

అంతలో అక్కడికొచ్చిన రంగన్న—

'బాబుగారూ! నిన్నటినుండి భోంచెయ్యలేదమ్మా! ఏదో తల్చుకొని బాధ పడుతున్నారు!' అన్నాడు.

'అయ్యో, రంగన్నా! వెళ్ళు. భోజనం తీసుకురా!' గాభరాగా అందామె.

'వద్దు సుమిత్రా! నన్నిలా వుండనియ్యి.' విసుగ్గా అన్నాడు శ్రీనివాస్.

'మీరు భోంచేస్తే మీకో గుడ్ న్యూస్ చెప్తాను.' ఊరింపుగా అంది సుమిత్ర.

'నాకేం అక్కరలేదు. దయచేసి యిక్కడ నుండి వెళ్ళిపో...ప్లీజ్!'

'ఏమిటండీ, మరీ చిన్న పిల్లాడిలా? మీరు భోజనం చేసే రెస్టు తీసుకోండి. రేపు భీమిలికి మనిద్దరమే వెళదాం! సరేనా? మీ కిష్టం లేకపోతే వద్దులెండి. రేపొస్తాను!...' అంటూ లేచింది సుమిత్ర.

'నిజంగానా?...' ఆనందాశ్చర్యాలతో ఒక్కుదుటున లేస్తూ అన్నాడు శ్రీనివాస్.

'ప్రామిస్.'

'అయితే, ఇప్పుడే భోంచేసేస్తాను. ప్లీజ్...నన్ను తీసుకెళ్ళవూ?' పసిపిల్లాడిలా అడుగుతున్న అతని తలను గుండెల్లో దాచుకుంది సుమిత్ర.

ఇద్దరి హృదయాల్లోనూ వసంతాలు పూసాయి. మనసులు పూదిపింజల్లా గగనవీధుల్లో విహరించాయి. చూసిన ప్రతి వస్తువు అందంగానూ, లోకమంతా ఆనందంగానూ, నూతనంగానూ, రంగుల హరివిల్లులా కనిపిస్తుంది వాళ్ళకు. లోకంలో సంతోషమంతా తమ స్వంతం అనిపిస్తుంది.

'శీమిలి వచ్చేశాం!' అతనికి చేయినందించి, దింపుతూ అంది సుమిత్ర.

'అయితే మొదట ఎక్కడికి వెళదాం?'

'గుడికి వెళదామా?'

'నీ యిష్టం!'

గుడిలో పూజారి తప్ప ఎవరూ లేరు. పై మెట్టు ఎక్కారు. అక్కడ ఏవో ప్రదేశాలనుండి వచ్చిన యాత్రికులు తమ పేర్లు అందంగా ఆ రాళ్ళపై చెక్కారు; వారి జ్ఞాపకార్థం అన్నట్లు. పై నుండి చూస్తుంటే—

ద్వారపాలకుల్లా చుట్టూవున్న కొబ్బరిచెట్లు మరీ అందముగా కన్పిస్తున్నాయి.

ఏదీ విడిచిపెట్టకుండా విడమర్చి అన్నీ శ్రీనివాస్‌కు చెపుతోంది సుమిత్ర.

తన కళ్ళతో చూస్తుంతగా ఆనందిస్తున్నాడు తను.

'బాగా ఎండ వచ్చేసిందిక్కడకు. క్రిందికెళ్ళి కూర్చుందామా?' అంటూ రెండు మెట్లు దిగింది సుమిత్ర.

పై మెట్లమీద నుండి దిగబోతున్న అతను మెట్టు తప్పించి అడుగు వేయడంతో - తూలిపోయాడు ముందుకు.

రెప్పపాటులో అది గమనించిన సుమిత్ర త్రుళ్ళిపడి అతడ్ని పట్టుకోకపోతే - విసురుగా వెళ్ళి గోడకు గుద్దేవాడు.

'సుమీ...' అంటూ ఆమెను తన కౌగిలిలోకి తీసుకున్నాడు శ్రీనివాస్.

'శ్రీ...' అంటూ అతని కౌగిలిలో తన్మయంగా ఒదిగిపోయింది సుమిత్ర.

ఆమె ముఖమంతా ముద్దులతో నింపాడతను.

ఇద్దరూ కొద్దిసేపు క్రింది మెట్టుమీద కూర్చున్నారు.

'సాయంత్రం కావస్తుంది. సముద్రపు ఒడ్డుకు వెళదామా?' అందామె.

మౌనంగా లేచాడు శ్రీనివాస్.

అక్కడక్కడ చిన్నపిల్లలు తప్ప, పెద్దగా జనం ఎవరూ లేరు. చీకటి పడుతుండడంలో పిల్లలు కూడా ఇంటికి చేరుకుంటున్నారు. సముద్రపు హోరు వింటూ, ఆమె చేయిని తన చేతిలోకి తీసుకొని కూర్చున్నాడు శ్రీనివాస్.

'సుమీ! నేను చాలా అదృష్టవంతుడ్ని కదూ?' మన

'కథాంజలి' జన్మదిన పండికకు మా హృదయ పూర్వకమైన శుభాకాంక్షలు !

Estd 1957 Phone : 2373



ఎల్లప్పుడూ...

మా ప్రసిద్ధిచెందిన

o జంకాళాలు o బెడ్ షీట్లనే

ఉపయోగించండి.

ఆంధ్రప్రదేశంలో మా ప్రతినిధిగా చేరుటకు సమర్థులైనవారి నుండి దరకాస్తు కోరబడుచున్నాము.

: తయారీందువారు :

Rainbow Industrials

P. B. No. 261 :: BHAVANI - 638 302.

'కథాంజలి' జన్మదిన సంచికకు మా హృదయపూర్వకమైన శుభాకాంక్షలు !




స్ఫూర్తిగా అన్నాడతను.

'ఎంతమాత్రమూ కాదు. ఏ అర్హతా లేని నేను, ఎలాంటి ఆకర్షణ, అందం లేని నేను అడవిలో పూచిన గడ్డిముక్కననీ, పిచ్చిపువ్వుననీ ఏ పూజకూ నోచుకోని విస్మృత కుసుమాన్ని నేననీ తలచుకొని కుమిలిపోతున్న నాకు. మీరు తారసిల్లడం ఒక అద్భుతం. మీ పూజకోసమే పూచిన పుష్పాన్ని కావడం నా అదృష్టమంది. అతని గుండెలపై వాలి కళ్ళు మూసుకుందామె.

'నిజంగా నేనంటే నీ కంతిష్టమా?'

'మీరలా అంటే నాకు కోపం వస్తుంది. నా ప్రాణం కంటే ఎక్కువగా మిమ్మల్ని ప్రేమిస్తున్నాను. మీరు లేక పోతే నాకు జీవితమే లేదండి. మీకు కళ్ళు వచ్చాక నన్ను చూసి అసహ్యించుకొని, నాకు దూరం అయితే ఆత్మహత్య చేసుకుంటానే తప్ప జీవించలేను. నా అణువణువులో మీరే నిండివున్నారు. నన్ను మీరు పెళ్ళాడకపోయినా, మీ యింట్లో పనిమనిషి స్థానాన్ని నాకిచ్చినా మిమ్మల్ని చూస్తూ నా జీవితాన్ని గడిపేస్తాను.' వెక్కి వెక్కి ఏడుస్తున్న ఆమె తలను ఒడిలోకి తీసుకొని, ఆప్యాయంగా నిమురుతూ వుండిపోయాడతను.

'సుమీ! నేను మరీ అంత విశ్వాసం లేనివాడ్ని కాదు. నన్ను ఇంతలా ప్రేమించిన నీకు నేను ఎటువంటి ద్రోహం చెయ్యను. ఈ పండు వెన్నెల సాక్షిగా, మనకు దీవెనలంద జేస్తున్న ఆ చుక్కల సాక్షిగా మన ప్రేమ ప్రమాణాలు చూస్తున్న ఈ సముద్రుడి సాక్షిగా, శతకోటి దేవతల సాక్షిగా, ప్రకృతి సాక్షిగా చెపుతున్నాను. నీకు నేనన్యాయం చెయ్యను!...' అంటూ ఆమె చేతిలో చెయ్యి వేశాడు

శ్రీనివాస్,

'చాలు, ఈ ఒక్క మాట చాలండీ! జీవితాంతం మీ కోసం ఎదురుచూస్తూ గడిపేస్తాను.'

'థేంక్స్...సుమీ!'

'శ్రీ...'

'ఊఁ...'

'అతని జుత్తులోకి వ్రేళ్ళను దూర్చి, కళ్ళు మూసుకుంది. ఆమె హృదయంలోంచి తన్నుకొస్తుంది ఆనందం.

'నా హృదయాన్ని నీముందుంచుతాను. ఎగతాళి చెయ్యవుగా?'

'ఊహుఁ...చెప్పు?'

కవ్వించి, కదిలించి దోచావు నా హృదయాన్ని. మురిపించి, వలపించి మరువకు మన ప్రణయాన్ని, ప్రణయ దేవునవు నీవని తలచి మురిసేను. గుండెను గుడిగా చేసి అందులో నిన్ను దైవంగా నిలిపి, కొలిచాను భక్తితో.

నా మనసునే పమిదగా చేసి—

అభిమానమునే చమురుగా పోసి—

అనురాగం వొత్తిగా వెలిగించి—

ప్రేమను హారతిని పట్టి—

వాకిట నిలిచాను నీ కోసం—

నీ మెడలో మాలగానైనా మిగలాలని.

'ఏయ్...ఏమిటి నీకు కవిత్వం కూడా వచ్చా?'

'ఊహూఁ...ఇష్టమయినవారిని తలచుకున్నా, వారి చెంతనే వున్నా, కవిత్వం కట్టలు త్రెంచుకొని ప్రవహిస్తుంది.'


'అయితే, నాకు రావడం లేదే?'

'నామీద నిజమయిన ప్రేమ లేదన్న మాట!'

'ఏయ్!' అంటూ చేతిమీద గట్టిగా గిల్లాడు శ్రీనివాస్.

''కథాంజలి'' జన్మదిన సంచికకు మా హృదయపూర్వకమైన శుభాకాంక్షలు!






'అబ్బా!' బాధగా అరిచిందామె.

'అయ్యో!' అంటూ ఆమె చేతిని తన గుండెల్లో దాచుకున్నాడు.

'అంతా నటన!' అందామె.

'లేదు సుమీ! నీకు ఏ మాత్రం బాధ కలిగినా అంతకు రెండింతలు నాకు బాధ కలుగుతుంది. నిన్ను బాధ పెడితే నన్ను నేను బాధ పెట్టుకున్నట్లే! నీకు ద్రోహం చేస్తే నేను సర్వనాశనం అయిపోతాను. నీలాంటి ప్రేమమూర్తి దొరకడం నా అదృష్టం '

'ఈ మాటలు ఇప్పుడు కాదు. మీకు కళ్ళొచ్చాక అంటే బాగుంటుంది. మీకు కళ్ళున్నా. లేకున్నా. నా ప్రేమ మాత్రం మారదని గుర్తుంచుకోండి. నా కందం లేక పోవచ్చు, మీరంటే అంతులేని అభిమానముంది. నాకు ధనం లేకపోవచ్చు! మీరంటే చచ్చేంత ప్రేముంది. మీ కోసం ఏమయినా చెయ్యగల సాహసం వుంది. అవునండీ! ఎందుకో మీరంటే నాకింత పిచ్చి?'

'ఎంత పిచ్చి?' కవ్వింపుగా అడిగాడు,

'మంచిగంధపు తరువునై నీపై కురవాలనుంది మల్లెల సుగంధాన్నై - నీ కోసం పరిమళించాలని వుంది. మకరందమూరుతున్నయ్. నిన్ను తన్మయత్వంలో ముంచాలనుంది.

ఆశల హరివిల్లునై - నిన్ను అల్లుకోవాలనుంది. పారిజాత పుష్పాన్నై - నిన్ను కొలవాలనుంది.

నీ అణువణువులో ప్రవహించే ప్రేమ నేనై నీలో నిండిపోవాలనుంది.

నీ ప్రేమవాసినై - పాదదాసినై నీ కోసం మిగిలిపోవాలనుంది.

అప్పటికే చాలా లైమయ్యింది. బాగా చలిగా కూడా అనిపిస్తుంది. మనిషి సంచారం ఎక్కడా లేదు. ఇసుకలో తిన్నగా పడుకుని అంతా శాంతంగా విన్న శ్రీనివాస్ ఆమెను -

చటుక్కున అతనిమీదకు లాక్కొని ఆమె పెదవులను గట్టిగా చుంబించి, ఊపిరి సలపనివ్వకుండా అతని బిగి కౌగిలిలో బంధించాడామెను. ఎంతో ఇష్టమై అతని కౌగిలిని వరంగా భావించిన ఆమె మనసంతా మైకం నిండిపోయింది. అలా ఎంత సేపున్నారో, ఏమేం జరిగిందో, తన మైకం పీడాకగాని తను తప్పు తెలిసి రాలేదు వాళ్ళకు. హద్దులు దాటి, ఎంతో దూరం పోయారన్న విషయం తెలుసుకున్న తరువాత - ఎవరిమట్టుకు వారే మనసుల్లో కుమిలిపోయారు. తప్పు చేశామన్న బాధ, వారి ముఖాల్లో కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది.

మౌనంగా లేచి అతని చేయి నందుకొని ముందుకు నడచింది సుమిత్ర.

•  •  •

గదిలో అడుగు పెట్టిన సుమిత్ర, అక్కడే ఆగిపోయింది.

శ్రీనివాస్ కూర్చున్న ఈజీఛెయిర్ గాలికి ఇటూ అటూ తనను వెక్కిరిస్తున్నట్లు ఊగుతుంది. గదంతా బోసిపోయినట్లు ఖాళీగా వుంది. అంతలో చందన వచ్చిందక్కడికి.

(సశేషం)